**ఏకుల బుట్టలో ఏకులూ, గాలీ కాక**

**ఇంకా ఏముంటుంది?**

# అరుణరాగం : ఒక అనుభూతి

**ఆర్. యస్. మూర్తి**

అతడు చేసిన అపరాధం ఏమంటే "అరుణ గ్రంధాలు" అమ్మబడే దుకాణం దగ్గర ఇటూ అటూ పచార్లుచేస్తూ కనిపించడమే. బహుశా అతణ్ణి ఆ దుకాణందగ్గిర "చాలజాగ్రత్తగా కాపలాకాసి కనిపెట్టడానికి" నియమితుడైన ఏ పోలీసో చూచిఉంటాడు. ఆ పోలీసు ఈ వార్త వెంటనే "తహసీల్ దార్ హెడ్ క్వార్టరుకు" చేరవేశాడు. అక్కడ నుంచి జిల్లా హెడ్ క్వార్టరుకు టెలిఫోనులో చెప్పితే ఆయన "కమీషనర్ హెడ్ క్వార్టరుతో" టెలిఫోనులో మాట్లాడాడు. కమీషనర్ హెడ్ క్వార్టరు వెంటనే "అపరాధి" (?) అండర్ గ్రౌండులోకి పోకుండానే అరెస్టు చేయవలసిందిగా హుకుం జారీచేశాడు.

మర్నాడతడు (అపరాధి ?) ఆఫీసుకు వెళ్లే ప్రయత్నంలో ఉండగా 50 మంది సాయుధ రక్షకభటులతో సబిన్స్పెక్టరువచ్చి ఇల్లు ముట్టడించాడు. ఇంటిచుట్టూ మంచి బందోబస్తుగా "పహరా" ఏర్పాటుచేసి 10 మంది సాయుధ పోలీసులను వెంటబెట్టుకొని "పిస్టల్" చేత పట్టుకొని మెల్లమెల్లగా అడుగులు వేసుకొంటూ ఇనస్పెక్టరు అపరాధి(?) ఉన్నచోటుకివచ్చాడు. వచ్చి అరెస్టుకు సిద్ధంగా ఉండవలసిందని అతణ్ణి కోరాడు.

"అరెస్టా?" అతడు కంగారుగా అన్నాడు. "కాని... కాని నేను చేసిన అపరాధం?"

"అది మీకెలా చెప్పగలం?" అని ఇనస్పెక్టరు నసిగి మళ్లీ కొంచెంసేపుండి అధికారస్వరంతో "కొంచెం మీకోటు విప్పండి" అని అంటూ పైజేబులోంచి ఫౌంటెన్ పెన్ పైకి లాగాడు. పెన్ను చాలాసేపు ఇటూ అటూ తిప్పి చాలా జాగ్రత్తగా పరీక్షచేసి చూసి "నిబ్బు" వైపు చూస్తూ "దీని "నిబ్బు" అవసరమైనదానికంటె ఎక్కువ విలువైంది.లా కనిపిస్తోంది. దీని కారణమేమిటో చెప్పండి" అన్నాడు.

"వ్రాయడానికి చాలా బాగుంటుందని" అపరాధి జవాబిచ్చాడు.

ఇనస్పెక్టరు పెన్నుతో కాగితం మీద రాస్తూ "పెన్నులోకి "ఎర్రసిరా" ఎందుకుపయోగిస్తున్నారు?" ప్రశ్నించాడు.

"నాకు "ఎర్ర" సిరా అంటే ప్రీతి."

"హుం. ఇంకా మీరు ఏంఅపరాధం చేశానని అడుగుతారు కదూ?" అంటూ ఇనస్పెక్టరు సంజ్ఞాపూర్వకంగా పోలీసులకేసి చూస్తూ నవ్వాడు.

ఇనస్పెక్టరు కోటుజేబులోంచి చిన్నపొట్లం లాగిచూస్తే అందులో ఒక వనిత ఫొటో కనిపించింది. "ఈ ఫొటో ఎవరిది?" ఇనస్పెక్టరు గంభీరంగా అడిగాడు.

"ఒక స్త్రీది."

"ఆమె పేరు?"

"ఆమెపేరా? నాకేం తెలుసు?"

"కాని ఆమె ఎవరు?"

"ఏమో! ఆతిష్ యువకుడై యున్నప్పటి కథ."

"ఆతిష్! ఆతిష్ ఎవరు?"

"ఒక కవి."

"ఆయన ఎడ్రస్ చెప్పండి" అని ఇనస్పెక్టరు నోటుబుక్కు తీశాడు.

"వ్రాసుకోండి. ఆతిష్, లఖ్నవీ స్వర్గపుర పోస్టు."

"స్వర్గపురా? బెంగాల్ లోది కాదూ?"

"కాదు"

"అయితే ఏ రాష్ట్రంలోది?"

"అట్లాస్‌లో వెతకండి సార్."

ఇనస్పెక్టరు జేబులోంచి సిగరెట్టు ముక్క పైకిలాగి వ్రేళ్ళసందున పెట్టుకొని పరిశీలిస్తూ "ఇందులో మీరు పొగాకు ఉపయోగిస్తారా?"

"కాదు"

"ఏమి ఉపయోగిస్తారు?"

"తుపాకిమందు"

"మీరు సిగరెట్టులో తుపాకిమం దుపయోగిస్తారా?"

"అవునండి"

"కారణం?"

"నోటి దుర్వాసన పోవడానికి"

ఇనస్పెక్టరు కొంచెం కోపితుడై మూడవ జేబు వెతకసాగాడు. జేబుగడియారం అందులోంచితీసి ఒక పోలీసుకేసి తిరిగి "ఈ గడియారం బ్రద్దలుకొట్టి పరీక్షించు" అని ఆజ్ఞాపించాడు.

ఇనస్పెక్టరు హుకుంచూస్తే అతనికి కొంచెం చిరాకు వేసింది. "గడియారం బ్రద్దలుకొట్టడం ఎందుకుసార్!" అడిగాడు ధైర్యంచేసి.

"గడియారంలో ఏదైనా దాచారేమో చూడడానికి"

"గడియారంలో ఏం దాస్తారుసార్"అమాయకంగా అడిగాడు అపరాధి.

"వెయ్యివస్తువులు దాచవచ్చు. ఉదాహరణకు కాగితపు ముక్కలు, రహస్యపత్రాలు."

"వైర్లెస్ యంత్రంకూడా దాచవచ్చు" అని ఒకపోలీసు తన "తెలివి" అధికారిదగ్గర ప్రదర్శించాడు. గడియారం బ్రద్దలుకొట్టారు కాని ఏమీ దొరకలేదు. "సరే! ఇక ఇల్లు వెదకాలి" అంటూ ఇనస్పెక్టరు సహచరులతో ఒక గదిలో ప్రవేశించాడు. "అందులో ఏ ముంది?" ఒక డబ్బాకేసి చేయి వేలుపెట్టి చూపుతూ అడిగాడు.

"కిరసనాయిలు"

డబ్బామీదకువంగి వాసనచూస్తూ ఇనస్పెక్టరు "ఇదేదో ద్రావకం వాసన వేస్తోందే"

"అది మీ ముక్కులోని దోషం"

"ఈఇనుపముక్కలిక్కడెందుకున్నాయి?"


# ఆంధ్ర బ్యాంక్ లిమిటెడ్

(స్థాపితము : 1923)

హెడ్డాఫీసు : మచిలీపట్టణము

జారీచేయబడిన మూలధనము, రిజర్వు కలిసి మొత్తం } రూ.34,00,000

అమలులోనున్న వ్యాపారము మొత్తం రూ. 6,00,00,000 లకు మించినది.

చైర్మన్ :

శ్రీ ఎస్. ఆర్. వై. శివరామ ప్రసాద్ బహదూర్ గారు,

చల్లపల్లి రాజాసాహెబ్.

డిప్యూటీ చైర్మన్ :

శ్రీ కె. సుబ్బారావు నాయుడుగారు,

మచిలీపట్నం.

మద్రాసు బ్రాంచి : 378, ఎస్ప్లనేడు.

త్యాగరాయనగర్ ఆఫీసు :

81/82 పాండీ బజారు, త్యాగరాయనగర్.

మైలాపూరు ఆఫీసు : 49, కచేరీ రోడ్డు, మైలాపూరు.

కోస్తా ఆంధ్ర జిల్లాలన్నిటిలోనూ బ్రాంచీలు, సబ్ ఆఫీసులూ ఉన్నాయి.

అన్ని రకముల డిపాజిట్లు ఆకర్షణీయమైన వడ్డీరేట్లకు తీసుకొనబడతాయి.

వివరములు బ్యాంకు యొక్క ఏ ఆఫీసులోనైనను తెలిసికొనవచ్చును.

మేనేజింగ్ డైరెక్టరు :

తాడేపల్లి శ్రీరాములు

జనరల్ మానేజరు :

ఇ. రామచంద్రమూర్తి

ఎం. ఏ., సి. ఏ. ఐ. ఐ. బి.

"తాళం బ్రద్దలు కొట్టాం. ఇవి దాని ముక్కలు సార్"

"ఎవరి తాళం బ్రద్దలు కొట్టారు?"

"మాదే"

"ఎందుకు బద్దలు కొట్టారు?"

"తాళం చెవి అందులో చిక్కుకుని రాలేదు"

"ఈ బీరువాలోవి ఏమిటి?"

"పుస్తకాలు"

ఇనస్పెక్టరు పుస్తకాలపేర్లు త్వరత్వరగా చూస్తూ హటాత్తుగా ఒక పుస్తకం పైకీతీసి: "ఈ పుస్తకంలో ఏమి వ్రాసారు?" అడిగాడు.

"చదవండి"

"నా కింగ్లీషు ఎక్కువగా రాదు"

"అయితే పుస్తకం అక్కడ పెట్టండి."

"అలా కాదు. బైండుమీద వ్రాసిన ఈ రెండు పంక్తులూ కొంచెం చదివి వినిపించండి.

"ఏ దేశంలో వాక్స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం అరికట్టబడుతవో ఆ దేశం సభ్యత గల దేశమనిపించుకోడానికి తగదు" అని చదివాడు అపరాధి.

"ఆ వాక్యాలు ప్రమాదకరాలు."

"ఇవి నెహ్రూజీవి."

"అయితే సరే, ఇందులో ఏముంది?" మంచంమీద పడివున్న ఏకుల బుట్టకేసి చూస్తూ అడిగాడు ఇనస్పెక్టరు.

"అందులోవి ఏకులు సార్!"

"అదిసరే! ఇంకా ఏముందని నా అభిప్రాయం."

"గాలి."

"నేను దుప్పట్లు అవీ తీసి చూడగోరుతున్నాను."

"కలిగే లాభం?"

"ప్రమాదకరమైన వస్తువులున్న వేమోనని."

దుప్పట్లూ అన్నీ తీసి చూడగా పరుపుక్రింద చచ్చిపడిఉన్న చిక్న పురుగుమాత్రంకనిపించింది.

"ఈ పెట్టెలలో ఏమున్నాయి?"

"బాంబులు, పిస్తోలు."

"వేళాకోళం కాదు. సరిగా చెప్పండి.

"ఇటికలూ, రాళ్ళూ ఉన్నాయి."

"మీరు మళ్ళీ వేళాకోళం చేస్తున్నారు. సరిగా చెప్పండి."

"ఏముంటాయని మీ రభిప్రాయ పడుతున్నారు?"

"బట్టలు."

"అయితే ఇంక అడగడం ఎందుకూ."

"అది నా కర్తవ్యం."

పెట్టెలన్నీ పూర్తిగా తెరిచి ప్రతి బట్టా ఇటూఅటూ తిప్పి పరీక్షించారు. పెట్టెలు తిరగేసి బోర్లించి మూస్తే అవి నిజంగా పెట్టెలేనని నిర్ధారణ అయింది.

"ఈ బిందెలో ఏ మున్నాయి?"

"తేళ్ళూ, పాములూ!"

ఈ డ్రాయర్లో ఏమున్నాయి?"

"భూకంపాలూ, గాలివానలూను."

"ఈ రేడియోలో ఏమున్నాయి?"

"నిట్టూర్పులూ, హాహాకారాలూను."

ఈ రీతిగా పరిశోధనా కార్యక్రమం 3 గంటలు పట్టింది. కెమికల్ ఎగ్జామినర్ దగ్గరకు పంపడానికి పరిశోధనచేసిన వస్తువుల "లిస్టు" ఒకటి తయారుచేశారు. ఆ లిస్టులో ముఖ్యమైనవి, కిరసనాయిలు డబ్బా, ఇనుపముక్కలు, పొగాకు, ఫౌన్ టెన్ కలం.

లిస్టు తయారుచేశాక "ఇన్ స్పెక్టరు" "పబ్లిక్ సెఫ్టీయాక్టు ఫలానా సెక్షన్ క్రింద మిమ్మల నరెస్టు చేస్తున్నాను. అని అన్నాడు...

ఆరు నెలలు జైలులో శిక్ష అనుభవించి విడుదలయినాక అరెస్టు (తనను) చేసిన కారణం ఒక "అరుణ గ్రంథాలు" విక్రయింపబడే దుకాణం ఎదుట పచార్లు చేస్తూ ఉండగా కనిపించడమే అని తెలిసింది ఆ అపరాధికి.